క్లుప్తంగా

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్ / వనస్థలిపురం రైతుబజార్లలో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 19, వంకాయ 18, బెండ 50, పచ్చి మిర్చి 35, కాకర 32, బీర 45, క్యాబేజీ 10, ఫ్రెంచిబీన్స్ 35, క్యారెట్ 15, దొండ 23–25, చిక్కుడు 25, గోకర 40, బీట్‌రూట్ 15, క్యాప్సికం 47, ఆలు 19, దోస 33, సొర 13, పొట్ల 15, ఉల్లి 14, చామగడ్డ 70 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం



చెక్కును అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

నాగోలు: ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు వరం లాంటిదని తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. కొత్తపేట డివిజన్ న్యూ మారుతీనగర్‌కు చెందిన శ్రీనివాసులు అనారోగ్య సమస్యలతో హాస్పిటల్ చేరి ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో సీఎం రిలీఫ్ ఫండ్ కోసం ఉప్పల శ్రీనివాస్‌గుప్తాను కలిశారు. స్పందించిన ఆయన సీఎం సహాయ నిధి నుంచి రూ. 40,500లను మంజూరు చేయించారు. అందుకు సంబంధించిన చెక్కును శుక్రవారం చెక్కును శ్రీనివాసులుకు నాగోలులోని తన నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ... మెరుగైన వైద్యం చేయించుకునే ఆర్థిక స్తోమత లేని పేదలు సీఎం రిలీఫ్ ఫండ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

ఎల్బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ శ్రీపురం కాలనీలోని పద్మావతీ సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పద్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి ముత్యంరావు, చంద్రయ్య, విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో బీజేపీకి అధికారం ఖాయం



సమావేశానికి హాజరైన కార్పొరేటర్ భాగ్యలక్ష్మి, బీజేపీ నేతలు

మలక్‌పేట: 'ప్రజా గోస–బీజేపీ భరోసా' అనే నినాదంతో చేపట్టిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లు మూసారంబాగ్ డివిజన్‌లో విస్తృతంగా నిర్వహిస్తున్నారు. మూసారంబాగ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీటింగ్‌కు కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి, భాగ్యనగర్ జిల్లా ఇన్‌చార్జి ఎస్.కుమార్, జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు గౌర దేవేందర్, ప్రధాన కార్యదర్శి సంరెడ్డి సురేందర్‌రెడ్డి, కోశాధికారి రమేష్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణలో నడుపుతున్న నయా నిజాం నిరంకుశ పాలనకు చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తుంటే, సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని విమర్శించారు. బూత్ స్థాయి నుంచి పార్టీని పటిష్ట పరిచి తెలంగాణ రాష్ట్రంలో కాషాయ జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. నేతలు వై.సురేందర్, విజయకాంత్, దినేష్‌కుమార్, తిరుమల్‌రెడ్డి, కొంగర ప్రవీణ్, జక్కా మోహన్‌రెడ్డి, భరత్, శశికాంత్ పాల్గొన్నారు.

స్వర్ణకారుల సమస్యలు పరిష్కరించాలని వినతి

బడంగ్‌పేట్: రాష్ట్రంలో స్వర్ణకారులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఎల్బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వర్ణకారుల సంఘం రాష్ట్ర నాయకులు మంత్రి కేటీఆర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా స్వర్ణకారుల సంఘం నాయకులు మాట్లాడుతూ.. ఉప్పల్ భగాయత్‌తో ఐదెకరాల స్థలాన్ని కేటాయించినందుకు కేటీఆర్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి రుణపడి ఉన్నామన్నారు. రాష్ట్రంలో పోలీసుల వేధింపుల కారణంగా స్వర్ణకారులు ఇబ్బందులు పడుతున్నారని కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. దొంగ బంగారం విషయంలో స్వర్ణకారులను పోలీసులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని వివరించారు. వెంటనే చర్యలు తీసుకుంటామని వారికి వివరించారు. మంత్రి కేటీఆర్‌ను కలిసిన వారిలో స్వర్ణకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వింజమూరి రాఘవచారి, కార్యదర్శి స్వామిచారి, జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మణాచారి, బడంగ్‌పేట కార్పొరేషన్ ఉపాధ్యక్షులు ఈశ్వరోజు బాలేశ్చారి తదితరులు పాల్గొన్నారు.





నీరులేక ఎండిపోతున్న మొక్కలు

పార్కుల్లో పచ్చదనానికి పాతర!

- నిర్వహణలో రాజ్యమేలుతున్న నిర్లక్ష్యం
- రోజురోజుకూ తగ్గిపోతున్న పచ్చదనం
- ఎండిపోతున్న మొక్కలు
- కళావిహీనంగా ప్రభాత్‌నగర్ పార్కు

చైతన్యపురి: చైతన్యపురి డివిజన్ ప్రభాత్‌నగర్‌లోని పార్కు పరిస్థితి రోజురోజుకూ అధ్వానంగా తయారవుతోంది. సమీప కాలనీల నుంచి అనేక మంది పార్కులోకి వచ్చి సేదతీరుతుంటారు. పార్కులోని ఓపెన్ జిమ్ వినియోగించుకునేందుకు మహిళలు, పురుషులు, యువత ఇక్కడకు వస్తుంటారు.

- అధికారుల పర్యవేక్షణ లేనందున పార్కు చెత్తకుప్పలా మారింది. నిత్యం పార్కు స్థలాన్ని శుభ్రం చేసి, మొక్కలుకు నీరు పోయాల్సి ఉంది. ఇందు కోసం పార్కు స్థలంలో ఓ రూం ఏర్పాటు చేసి ఓ వాచ్‌మన్‌ను నియమించారు.
- పార్కును పరిశీలిస్తే సక్రమంగా నిర్వహిస్తున్నటు కనిపించదు. పార్కులోని సిమెంటు బెంచీల పక్కన చెత్త పేరుకుపోయి సందర్శకులకు అసౌకర్యాన్ని కలిగిస్తోంది.
- ఇకనైనా జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి పార్కులో పచ్చదనాన్ని అభివృద్ధి చేయాలని, సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



నిర్వహణ లేక అధ్వానంగా మారిన ప్రభాత్‌నగర్ పార్కు

కాలనీల్లోని పార్కుల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారవుతోంది. సంబంధిత యంత్రాంగం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తుండటంతో ఆహ్లాదాన్ని పంచాల్సిన పార్కులు అందవిహీనంగా మారుతున్నాయి. రాలిపోయిన ఆకుల కుప్పలు, నీరు లేక ఎండిపోతున్న మొక్కలు దర్శనం ఇస్తున్నాయి. ఎల్బీనగర్ నియోజకవర్గంలోని కొన్ని డివిజన్లలో పార్కులకు స్థలాలు లేవు. మరికొన్ని ప్రాంతాల్లో ఉన్న పార్కులు మాత్రం సరైన నిర్వహణ, అభివృద్ధికి నోచుకోవటం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నిర్లక్ష్యం తగదు



కొన్ని ప్రాంతాల్లో పార్కులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అయితే అన్ని వసతులు ఉండి నిర్వహణ లేకపోవడంతో ప్రభాత్‌నగర్ పార్కు అంద విహీనంగా మారింది. పార్కు మొత్తం ఎండిపోయిన ఆకులు, చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. వేసవిలో సక్రమంగా నీరు పోయకపోతే పచ్చదనం పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితి వస్తుంది. రోజూ సాయంత్రం వేళ ప్రజలు పెద్ద ఎత్తున తమ పిల్లలతో పార్కుకు వస్తుంటారు. అధికారులు ఇంత నిర్లక్ష్యం ఎందుకు వహిస్తున్నారో అర్థం కావటం లేదు. జీహెచ్ఎంసీ అధికారులు వెంటనే స్పందించి పార్కు నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నా.

– ఆర్.రాజమోహన్‌రాజు, చైతన్యపురి

రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆర్‌కేపురం కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డి అన్నారు. ఆర్‌కేపురం డివిజన్‌లోని రోడ్లు గుంతలుగా మారాయి. వాటిని బీటీ రోడ్లుగా వేస్తున్నారు. ఆ పనులను జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. రోడ్డు పనులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యతతో వేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. బీజేపీ నేతలు రాములు యాదవ్, సుదర్శన్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన

ఎల్బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని లుమిని ఎలైట్ కాలనీలో జరుగుతున్న బీటీ రోడ్డు పనులను శుక్రవారం కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలతో పనులు నిర్వహించాలని అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. జీహెచ్ఎంసీ ఏఈ రాకేష్, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు నవకిశోర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, వివేకానంద కాలనీ ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



బీటీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

నిధుల మంజూరుపై హర్షం

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి చొరవ తీసుకొని హెచ్ఎండీఏ ద్వారా రూ.2.87 కోట్లు మంజూరు చేయించడం హర్షణీయమని 13వ వార్డు కౌన్సిలర్ పుష్పమ్మ అన్నారు. ఆ నిధులలో 13వ వార్డుకు సీసీ రోడ్డు కోసం రూ.35 లక్షలు కేటాయించడాన్ని పురస్కరించుకొని స్థానిక మహ్మదీయ కాలనీ రెసిడెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి ఎంపీకి పూలబొకే అందజేశారు. ఎంపీని కలిసిన వారిలో అసోసియేషన్ అధ్యక్షుడు హమీద్‌ఖాన్, మాజీ వార్డు సభ్యులు సూర్యకుమార్ గౌడ్, ఖదీర్, నాయకులు విక్రాంత్‌గౌడ్, విశాల్ గౌడ్, మినాజ్, ఇస్మాయిల్, ఆమెర్, అవేజ్ తదితరులు ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న లింగాల హరిగౌడ్

సైదాబాద్: అన్నివర్గాల ప్రజల అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరించాలని ఆ పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి లింగాల హరిగౌడ్ సూచించారు. ప్రజాగోస–బీజేపీ భరోసా పేరుతో సైదాబాద్ డివిజన్ ఫిష్ మార్కెట్ వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వ ప్రజావ్యతిరేక పాలనకు రానున్న ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పటం ఖాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అందకపోవడంతో మలక్‌పేట నియోజకవర్గ పరిధిలో ఎందరో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పదిహేనేళ్లుగా ఇక్కడ మజ్లిస్ ఎమ్మెల్యే అభివృద్ధిని విస్మరిస్తున్నారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో మలక్‌పేటలో బీజేపీ విజయం సాధించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డి, సహదేవ్‌యాదవ్ పాల్గొన్నారు.

ఆశావర్కర్స్ యూనియన్ కార్యవర్గం ఎంపిక

మీర్‌పేట: తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ బాలాపూర్ యూపీహెచ్‌సీ నూతన కమిటీని శుక్రవారం ఆసుపత్రి ఆవరణలో సీఐటీయూ మండల బాధ్యులు జే.పెంటయ్య, ప్రజాసంఘాల నాయకులు యాదయ్యల సమక్షంలో ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా లీలావతి, ప్రధాన కార్యదర్శిగా టి.భాగ్యలక్ష్మీ, కోశాధికారిగా బి.సుజాత, కమిటీ సభ్యులుగా ఎం.సుజాత, డి.బాలమణి, సుమలత, వరలక్ష్మీ, హేమలత, అనిత, రజనీలు ఎన్నికయ్యారు.

వీధి కుక్కల దాడిలో చిన్నారికి గాయాలు



దీక్షత్‌ను పరామర్శిస్తున్న కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: నగరంలో వీధి కుక్కలు దాడులు కొనసాగుతున్నాయి. శుక్రవారం కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్‌లోని జనప్రియ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే దేవేందర్, కుసుమ దంపతుల కుమారుడు శ్రీసాయి దీక్షత్(8)పై కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. వివరాలివీ... దీక్షత్ స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ పాఠశాలలో 3వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం సాయంత్రం పాఠశాల నుంచి వచ్చి ఇంటి ముందు ఆడుకుంటుండగా అక్కడే ఉన్న వీధి కుక్కలు ఒక్క సారిగా ఆ బాలుడిపై దాడి చేశాయి. దీంతో దీక్షత్ పెద్ద ఎత్తున కేకలు వేయడంతో స్థానికులు కుక్కలను అక్కడి తరిమి కొట్టారు. గాయపడిన దీక్షత్‌కు కుటుంబ సభ్యులు నాగోలులోని ఓ హాస్పిటల్‌లో చికిత్స చేయించారు. కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ జనప్రియ అపార్ట్‌మెంట్‌కు వెళ్లి దీక్షత్‌ను పరామర్శించారు. రెండు రోజుల క్రితమే మారుతీనగర్‌లో నాలుగేళ్ల బాలుడిని కుక్కల దాడి చేసి గాయపర్చాయి. ఇలా వరుస సంఘటనలు జరుగుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని కార్పొరేటర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

'డబుల్' ఇళ్ల విషయంలో పేదలను వంచించిన బీఆర్ఎస్

బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి



గడ్డిఅన్నారంలో మాట్లాడుతున్న సామ రంగారెడ్డి

చైతన్యపురి: బీజేపీ కార్పొరేటర్ల విషయంలో ప్రొటోకాల్ పాటించకుండా ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి వారిని అవమానిస్తున్నారని బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి విమర్శించారు. గడ్డిఅన్నారం డివిజన్‌లో ప్రజా గోస బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా శక్తి కేంద్రాల ఇంచార్జిలు ఓంకార్, బడి నిర్మల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గంలో నిధులను సద్వినియోగం చేసే విషయంలో ఎమ్మెల్యే విఫలం అయ్యారని తప్పుబట్టారు. రిజిస్ట్రేషన్ సమస్య పరిష్కారం కోసమే అధికార పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించిన ఎమ్మెల్యే మునుగోడు ఎన్నికల సమయంలో 118 జీవోను తీసుకొచ్చారని ఇప్పుడు మళ్లీ సవరణలతో జీవో తీసుకొస్తామని మరో నాటకం తెరపైకి తెస్తున్నారని పేర్కొన్నారు. జీహెచ్ఎంసీని దివాళా తీయించిన దగాకోరు టీఆర్ఎస్ ప్రభుత్వం అని విమర్శించారు. డబుల్ బెడ్‌రూంల విషయంలో పేదలను వంచించిదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పన్నులు ఫుల్ పనులు నిల్ అనే చందంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు ఆయన సూచించారు. నాయకులు జయప్రకాష్, ఆనంద్‌కుమార్, రాంరెడ్డి, లక్ష్మీప్రసాద్, శ్రీధర్‌రెడ్డి, శరత్, శివ, సాయి వివేక్, తమ్మిశెట్టి వివేక్, శ్రీలక్ష్మి, కొండూరు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: హయత్‌నగర్ పరిధి షిరిడీ సాయినగర్‌కాలనీ (వీరన్నగుట్ట)కు చెందిన బానోతు దేవా మెదడుకు సంబంధించిన వ్యాధితో బాధపడుతూ నగరంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. చికిత్స ఖర్చులు భరించలేక తాము ఇబ్బందులు పడుతున్నామని మృతుని కుటుంబ సభ్యులు ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని ఆశ్రయించారు. స్పందించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ. 1.50 లక్షలు మంజూరు చేయించి అందుకు సంబంధించిన చెక్కును మృతుని భార్య అరుణకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పేదల ఆరోగ్య పరిరక్షణకు సీఎం సహాయనిధి ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ అవకాశాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కేకేఎల్ గౌడ్, భాస్కర్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

యాగశాల ప్రారంభం

వనస్థలిపురం: చరిత్రకు నిలువెత్తు సాక్షాలు ఆలయాలని, లోక కల్యాణార్థం యాగాలు, యజ్ఞాలు అవసరమని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అన్నారు. హైకోర్టు కాలనీలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన యాగశాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఆలయ అభివృద్ధికి తనవంతు సహాయ, సహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు గోవిందాచారి, ఎర్రవెల్లి సత్యనారాయణ, ఆలయ ప్రతినిధులు శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రావు, నాగరాజు, సత్యనారాయణమూర్తి, ప్రసాద్‌రావు, మురళీకృష్ణ, సింహారెడ్డి, రంగారావు, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

చెత్తకుప్పలు తొలగించండి



మలక్‌పేట: పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేకపోవడంతో చెత్త కుప్పలుగా పేరుకుపోయాయి. అధికారుల పర్యవేక్షణ కొవడటంతో పారిశుద్ధ సిబ్బంది సక్రమంగా చెత్తను తొలంగించడం లేదు. గవర్నమెంట్ క్వార్టర్స్‌లోని బీ బ్లాక్‌లో చెత్తకుప్పలుగా పేరుకుపోయింది. క్వార్టర్స్ మెయిన్ గేట్ గోడ దగ్గర కుళ్లిన పదార్థాలు, వ్యర్థాలు, చెత్త పడేశారు. సమీపంలోని ఫిస్ బధిర ఆశ్రమ పాఠశాల విద్యార్థులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు



అంజలీ రెసిడెన్సీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి తదితరులు

మన్సూరాబాద్: డివిజన్‌లో అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నామని జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. ప్రగతినగర్‌కాలనీ, స్వాతి రెసిడెన్సీలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... నాణ్యత ప్రమాణాలతో సీసీ రోడ్డు పనులను వేగవంతంగా పూర్తిచేయాలని కోరారు. కాలనీలలో మిగిలిపోయిన డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్ పనులకు త్వరలోనే నిధులు మంజూరు చేయించి పూర్తిచేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ నేతలు వినోద్‌కుమార్, శంకర్‌గౌడ్, సురేందర్‌రెడ్డి, రామారావు, వెంకటేష్ నాయకులు కదారి యాదగిరియాదవ్, సోమనాథ్, సంతోష్, సాయిరాంగౌడ్, నవీన్‌గుప్తా పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శంకర్‌రాజు

మలక్‌పేట: దిల్‌సుఖ్‌నగర్‌లోని నోబుల్ డిగ్రీ కాలేజీ విద్యార్థులకు బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో శుక్రవారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. టీటీఐ ఏసీపీ జి.శంకర్‌రాజు పవర్ ప్రజెంటేషన్ ద్వారా మైనర్ డ్రైవింగ్, స్టాప్‌లైన్, రాంగ్ రూట్, ట్రిబల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ వలన కలిగే అనర్థాలు వివరించారు. ప్రమాద రహిత నగరం కోసం ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. సమయం వృథా చేసుకోకుండా క్రమశిక్షణతో లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలన్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ భాస్కర్‌రావు, టీటీఐ ట్రాఫిక్ సిబ్బంది మాజిద్‌ఖాన్, చిరంజీవి, మలక్‌పేట ఎల్అండ్‌వో, ట్రాఫిక్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లను కబ్జాచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

హస్తినాపురం: ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన ఇళ్లను దళారులు కబ్జాచేసి అమ్ముకుంటున్నారని అలాంటివారిని గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎల్బీనగర్ బీఎస్పీ ఇంచార్జి జక్క యాదగిరి కోరారు. శుక్రవారం హస్తినాపురం డివిజన్ నందనవనంకాలనీలో లబ్ధిదారులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యాదగిరి మాట్లాడుతూ... స్థానికులు, డీడీలు కట్టి బయట నివాసం ఉంటున్న వారికి కాకుండా దళారులు జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇళ్లను కబ్జాచేసి అమ్ముకుంటున్నారని ఆరోపించారు. ఒక్కొక్కరు 30 నుంచి 40 ఇండ్లు కబ్జాచేసి అద్దెకు ఇచ్చుకుంటున్నారన్నారు. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి జోక్యం చేసుకుని అర్హులను గుర్తించి వారికి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో నేతలు మురళి, రవి, విజయ, జ్యోతి, రజియా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జక్క యాదగిరి

దేవాలయాల్లో గోపూజను పాటించాలి



అయ్యప్ప భక్తసమాజానికి గోవును దానం చేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

సైదాబాద్: అన్ని హిందూ దేవాలయాల్లో గోమాతను పూజించాలనే సత్‌సంకల్పంతో గుడికో గోమాత కార్యక్రమాన్ని చేపట్టామని అఖిల భారత గో సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు బాలకృష్ణ గురుస్వామి తెలిపారు. అందులో భాగంగా శుక్రవారం సైదాబాద్ కాలనీ రామాలయం గోశాల సహకారంతో చైతన్యపురిలోని అయ్యప్ప భక్తసమాజం ఆలయానికి ఫౌండేషన్ ప్రతినిధులతో కలిసి ఆయన గోవును దానం చేశారు. అనంతరం సైదాబాద్‌లో ఆయన మాట్లాడుతూ... సకల దేవతా స్వరూపంగా భావించి పూజించే గోవును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ ప్రాణిగా ప్రకటించాలని ఆయన కోరారు. గో ఆధారిత వ్యవసాయం, గో ఉత్పత్తులను అందరూ ప్రోత్సహించాలని కోరారు. దేవాలయాలకు వచ్చే భక్తులు గోవును పూజించే భాగ్యాన్ని కల్పించేలా ఆలయ నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో చంద్రస్వామి, శ్రీనివాస్‌గౌడ్, గోవర్ధన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, బాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళను కత్తితో బెదిరించి నగదు దోపిడీ

- పారిపోయే క్రమంలో కిందపడిపోయిన గొలుసు
- రోల్డుగోల్డుది కావడంతో వదిలేశారన్న పోలీసులు



బాధితురాలు స్వర్ణలత

హయత్‌నగర్: కిరాణా షాపులో ఒంటరిగా ఉన్న ఓ మహిళను కత్తితో బెదిరించిన దుండగులు ఆమె మెడలోని గొలుసు, నగదును దోచుకెళ్లిన సంఘటన శుక్రవారం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... మన్సూరాబాద్ డివిజన్‌లోని ఎల్లారెడ్డి కాలనీకి చెందిన పసుల స్వర్ణలత స్థానికంగా శివసాయి కిరాణాషాపు నడుపుతోంది. శుక్రవారం మధ్యాహ్నం బైకుపై వచ్చిన ఇద్దరు దుండగులు షాపు వద్ద ఆపి సిగరెట్ ఉందా అంటూ వచ్చారు. సిగరెట్ తీసుకుని వెళ్లిపోయిన వారు తిరిగి 3:15 గంటలకు వచ్చారు. షాపు వద్ద మహిళ తప్ప ఎవరూ లేకపోవడంతో తమ దగ్గర ఉన్న కత్తితో బెదిరించి మెడలోని గొలుసు ఇవ్వమని బెదిరించారు. తర్వాత డబ్బులు ఇవ్వమన్నారు. బెదిరిపోయిన స్వర్ణలత గొలుసుతో పాటు షాపులో ఉన్న రూ. 5 వేలను ఇచ్చేసింది. దుండగులు హడావిడిగా బైకుపై వెళ్తుండగా వారి చేతిలోని గొలుసు కిందపడి పోయింది. కింద పడిన గొలుసును తీసుకున్న స్వర్ణలత వారిని వెంబడించినా ఫలితం లేకపోయింది. దుండగులు మాస్కుతో పాటు హెల్మెట్, కళ్లద్దాలు ధరించి ఉన్నారని, వాహనానికి నెంబర్ ప్లేటు లేదని బాధితురాలు తెలిపింది. గొలుసు రోల్డు గోల్డుది కావడంతో దుండగులు వదిలేసి పోయినట్లు పోలీసులు అంటున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సీసీ కెమెరాల ఆధారంగా దుండగులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.